# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 17 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4


## జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

- ఒక జవాన్, ఇద్దరు మావోయిస్టులు మృతి
- బొకారో జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఘటన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్నది. ఈ ఘటనలో ఒక సీఆర్పీఎఫ్ జవాన్‌తో పాటు ఇద్దరు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఇది బొకారో జిల్లాలోని అటవుల్లో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయని పోలీసు అధికారులు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోమియా పోలిస్‌స్టేషన్ పరిధిలోని బిర్‌హోర్‌డెరా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, సీఆర్పీఎఫ్ జవాన్లకు మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. బుధవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఇరు వర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. సీఆర్పీఎఫ్ కోబ్రా బెటాలియన్‌కు చెందిన ఒక జవాన్ ప్రాణాలు కోల్పోయారని బొకారో జోన్ ఐజీ క్రాంతి కుమార్ గడిదేసి తెలిపారు. ఎన్‌కౌంటర్ తర్వాత కూడా ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నదని బొకారో ఎస్పీ హర్విందర్ సింగ్ చెప్పారు.

## జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు

- 31 జెడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఉన్నట్లు వెల్లడి
- 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని వెల్లడి
- 12,778 గ్రామ పంచాయతీలు, 1.12 లక్షల వార్డులను గుర్తించినట్లు వెల్లడి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో స్థానిక పోరుకు రాష్ట్ర సర్కారు శరవేగంగా సన్నద్ధమవుతున్నది. రాష్ట్రంలో 5,773 ఎంపీటీసీ స్థానాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఖరారు చేసింది. 566 జెడ్పీటీసీ స్థానాలను, 566 ఎంపీపీ స్థానాలను, 31 జిల్లా పరిషత్‌లను ప్రకటించింది. ఇటీవల ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ముసాయిదాను విడుదల చేసి వచ్చిన పలు అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని ఫైనల్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఎన్నికల సామాగ్రి(వైట్, పింక్ పేపర్లు, కవర్లు, సీల్స్, అడ్రస్ ట్యాగ్‌లు, స్టేషనరీ, నాన్ స్టేషనరీ వస్తువులు, తదితరాలు)ని సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లు, జిల్లా పరిషత్ సీఈఓలు, జిల్లా పంచాయతీరాజ్ ఆఫీసర్లకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణ వ్యాప్తంగా 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని పేర్కొంది. అదేవిధంగా, 12,778 గ్రామ పంచాయతీలు, 1.12 లక్షల వార్డులు ఉన్నట్లు తెలిపింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ స్థానాలను ఖరారు చేసింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల కాలపరిమితి గత ఏడాది ప్రారంభంలో ముగిసింది.

# నది జాలాలపై కమిటీ

- టెలీమెట్రీ విధానానికి ఓకే
- ప్రాజెక్టుల వద్ద టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు
- శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులు, రక్షణకు చర్యలు
- నిర్ణయాలన్నీ తెలంగాణ విజయమే
- సీఎం రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగాన్ని పర్యవేక్షించడానికి యుద్ధ ప్రాతిపదికన టెలిమెట్రీ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో జరిగిన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం నిర్ణయించింది. కేంద్ర జలశక్తి మంత్రి గారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాలుగు అంశాలపై ఒక నిర్ణయానికి వచ్చామని సమావేశం అనంతరం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వివరించారు.

ఇరు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న నదీ జలాల వినియోగంపై కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఢిల్లీలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇరు రాష్ట్రాల మధ్య నాలుగు అంశాల్లో అంగీకారం కుదిరినట్టు తెలిపారు. నదీ జలాల విషయంలో రాష్ట్రం వెలిబుచ్చిన అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకుని టెలిమెట్రీ విధానం అమలు చేయాలని తెలంగాణ ఎప్పటి నుంచో అడుగుతున్నామని, అందుకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించిందని చెప్పారు.

నదీ జలాల్లో అన్ని పాయింట్స్ లో టెలిమెట్రీ విధానాన్ని యుద్ధప్రాతిపదికన అమలు చేయడానికి అంగీకారం కుదరడం తెలంగాణ విజయంగా ముఖ్యమంత్రి గారు అభివర్ణించారు. "నదీ జలాల విషయంలో ఇరు రాష్ట్రాలు ఎవరు ఎక్కు, ఎవరు తక్కువ వినియోగిస్తున్నారని పరిశీలించడానికి టెలిమెట్రీ విధానం అమలు చేయాలని మొదటి నుంచి కోరుతున్నాం. రాష్ట్ర విభజన చట్టంలో ఈ అంశం ఉన్నప్పటికీ ఇంతకాలం అమలు జరగలేదు. విభజన చట్టంలో పేర్కొన్నట్టుగానే గోదావరి నది యాజమాన్య బోర్డు తెలంగాణ నుంచి, కృష్ణా నది యాజమాన్య బోర్డు ఆంధ్రప్రదేశ్ నుంచి పనిచేయాలన్న అంశంపై అంగీకారం కుదిరింది. గతంలో జరిగిన ఎపెక్స్ కమిటీ సమావేశంలోనే దీనిపై నిర్ణయం తీసుకున్నా అమలు జరగలేదు.

ప్రతిష్టాత్మకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి నిపుణులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారుల సూచనల మేరకు ప్లంజ్ పూల్ తో పాటు అవసరమైన మరమ్మత్తులు చేపట్టడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది. యుద్ధ ప్రాతిపదికన ఆ పనులు చేపట్టడానికి అంగీకారం తెలియజేసింది. ఇకపోతే, రెండు రాష్ట్రాల మధ్య కృష్ణ, గోదావరి నదులు, వాటి ఉప నదుల నీటి వినియోగంపై అపరిష్కృతంగా ఉన్న అంశాలపై సీనియర్ అధికారులు, నిపుణులతో కూడిన ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగింది. కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత నెల రోజుల్లోగా నదీ జలాలపై ఇప్పటికే నిర్మించిన ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, ప్రతిపాదిత ప్రాజెక్టులు, ఇతర సమస్యలు అన్నింటిపైనా సమగ్రంగా అధ్యయనం చేసి సూచనలు ఇస్తుంది. కమిటీ నిర్ణయాలను బట్టి తదుపరి ఏ విధంగా ముందుకు వెళ్లాలన్నది నిర్ణయిస్తాం.

గోదావరి -బనకచర్లపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ, రివర్ మేనేజ్మెంట్ అథారిటీ, సీడబ్ల్యూసీ వంటి సంస్థలన్నీ వాటి అభ్యంతరాలను తెలియజేశాయి. గోదావరి %-% బనకచర్ల చేపడుతామని ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చెప్పలేదు. వారు చెప్పినప్పుడు ఆ ప్రాజెక్టును ఆపాలని తెలంగాణ అభ్యంతరం చెబుతుంది. నాలుగు అంశాలపై సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నాం. అధికారుల కమిటీలో అన్ని అంశాలు చర్చకొస్తాయి. ఇరు రాష్ట్రాల మధ్య సమస్యలను గుర్తించి వాటిపై ఎలా ముందుకు వెళ్లాలని నిర్ణయిస్తాం. కేంద్ర మంత్రి పాటిల్ సమక్షంలో జరిగిన సమావేశంలో సుహృద్భావ వాతావరణంలో జరిగింది. పాటిల్ గారు ఒక జడ్జిలా వ్యవహరించారు. ఇది ఇన్ ఫార్మల్ గా జరిగిన సమావేశం. ఇరు రాష్ట్రాల మధ్య కేంద్రం ఒక వేదికగా వ్యవహరించింది. టెలిమెట్రీ విధానం అమలుకు ఏపీ అంగీకరించడం తెలంగాణ విజయం ఇరు రాష్ట్రాల మధ్య సమస్యలను పరిష్కరించుకోవడానికి ఢిల్లీ వచ్చాం. జఠిలం చేసుకోవడానికి కాదు. జఠిలమైతే బాగుండని కొందరు అనుకుంటుండొచ్చు. మేం తెలంగాణ

మిగితా 2వ పేజీలో

### నిపుణుల కమిటీ రిపోర్టు మేరకే తదుపరి చర్యలు

- ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

నదీ జలాలపై నిపుణుల కమిటీ రిపోర్టు మేరకే తదుపరి చర్యలు ఉంటాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ఏపీ ప్రభుత్వం నుంచి గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట కడతామనే ప్రతిపాదన చర్చకు రాలేదన్నారు. ఎజెండాలో వారు కడతామనే ప్రతిపాదనే లేనప్పుడు, దాన్ని ఆపాలనే చర్చే ఉండదని స్పష్టం చేశారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం జరిగిందనీ, ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం కేవలం నిర్వాహక పాత్రే పోషించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎవరివైపూ మాట్లాడలేదనీ, ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలన్నీ తెలంగాణ విజయమేనని అన్నారు. నాలుగు అంశాలపై చర్చించామనీ, ఆ అంశాలపైనే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. సమస్యలను పరిష్కరించుకునేందుకే ఉన్నామనీ, గొడవలు పెట్టుకునేందుకు లేమని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాలు గొడవలు పెట్టుకోవాలని

మిగితా 2వ పేజీలో

## ముసుగు వీడింది

- 48వ ఢిల్లీ పర్యటన గుట్టురట్టయ్యింది
- నిధులు రాహుల్ గాంధీకి, నీళ్లు చంద్రబాబుకి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. జలవనరుల అంశంపై కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కీలక సమావేశానికి ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులతో పాటు మంత్రులు, ఉన్నతాధికారులు హాజరైన సంగతి తెలిసిందే. ఈ భేటీ అనంతరం సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.. బనకచర్ల అంశం ఈ సమావేశంలో చర్చకు రాలేదని, అన్ని పిర్యాదులను ప్రత్యేకంగా ఏర్పాటయ్యే కమిటీ పరిశీలిస్తుందని స్పష్టం చేశారు. ఇదే విషయంపై కేటీఆర్ తన సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. "సీఎం రేవంత్ ముసుగు తొలగిపోయింది.. ఢిల్లీ పర్యటన వెనుక నిజాలు బయట పడ్డాయి. నిధులు రాహుల్‌గాంధీకి.. నీళ్లు చంద్రబాబుకు.. తుది ఫలితం తెలంగాణ ప్రజలకు బూడిదే" అంటూ విమర్శించారు. బనకచర్లపై చర్చే జరగలేదని చెప్పడాన్ని బుకాయింపు అంటూ ఎద్దేవా చేశారు. "గురుదక్షిణగా గోదావరి జలాలను అప్పజెప్పేందుకే నీ ఢిల్లీ పర్యటనా?" అంటూ సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు.

"జై తెలంగాణ అన్నదానికి సిగ్గుపడుతున్నావు.. కానీ నాలుగు కోట్ల ప్రజల హక్కులను చంద్రబాబుకు ధారపెట్టడానికి మాత్రం వెనుకాడటం లేదే!" అని నిలదీశారు. "కోవర్టులు ఎవరు? తెలంగాణ కోసం కొట్లాడినవారు ఎవరు? ఈరోజుతో స్పష్టమైంది. నీ గురువుపై నమ్మకం చాటేందుకు తెలంగాణను తాకట్టు పెడతావా?" అంటూ విరుచుకుపడ్డారు.

"రెండు రాష్ట్రాలు ఎందుకు? ఇద్దరు ముఖ్యమంత్రులెందుకు? సరిహద్దులు చెరిపేస్తేనే నీ అక్కసు చల్లారుతుందా? ఒక్క బొట్టు నీరు అక్రమంగా అప్పజెప్పినా మరో ఉద్యమానికి నాంది పలుకుతాం. ప్రాంతేతరుడు మోసం చేస్తే తరిమేస్తాం.. ప్రాంతీయుడు మోసం చేస్తే పాతిపెడతాం!" అంటూ హెచ్చరించారు.



## మూడు రోజులు భారీ వర్షాలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా మారాయి. ఈ ప్రభావంతో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రుతుపవన ద్రోణి బుధవారం రాజస్థాన్ పరిసర ప్రాంతాలలోని అల్పపీడనం మీదుగా ఈశాన్య బంగాళాఖాతం వరకు కొనసాగుతున్నట్టు వెల్లడించింది. ఈనెల 22వ తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు ప్రకటించింది. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసినట్టు వెల్లడించింది. గురువారం ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. గడిచిన 24 గం టల్లో మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట్ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసినట్టు వెల్లడించింది. అత్యధికంగా మెదక్ జిల్లా చేగుంటలో 2.85 సెం.మీ వర్షం కురిసినట్టు పేర్కొన్నది.

## విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించాలని, వాటి కోసం భూములు కోల్పోయిన ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గత ఏడాది మార్చి 24న 308.45 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా కాగా, ఈ ఏడాది మార్చి 18న 335.19 మిలియన్ యూనిట్లు సరఫరా చేయడం రాష్ట్ర చరిత్రలోనే రికార్డుగా నిలిచిందని ఆయన వెల్లడించారు.

2024 నుంచి రాష్ట్ర విద్యుత్ డిమాండ్ ప్రతి సంవత్సరం సగటున 9.8 శాతం పెరుగుతోందని, 2034 నాటికి ఇది 33,773 మెగావాట్లకు చేరే అవకాశముందని కేంద్ర సంస్థల అంచనాలను భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గత ఏడాది 15,497 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదు కాగా, ఈ ఏడాది మార్చి 20న 17,162 మెగావాట్లు నమోదు కావడం గమనార్హం.

ఫాస్టెస్ట్ గ్రోయింగ్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్‌లో అండర్‌గ్రౌండ్ కేబుల్స్ ఏర్పాటుకు పూర్తి స్థాయి డీపీఆర్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న 12.5 మిలియన్ యూనిట్ల ట్రాన్స్ఫార్మర్ల స్థానంలో 16 మిలియన్ యూనిట్ల ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాన్స్ఫార్మర్ల స్థల కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పునరుత్పాదక ఇంధనంపై దృష్టి సారించాలని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికతో ముందడుగు వేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్‌కో సీఎండీ హరీష్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారుకీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం అగదు

- ఎమ్మెల్సీ కవిత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో 25 వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులుగా ఎదగే వరకు ఉద్యమం కొనసాగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో యునైటెడ్ పీపుల్స్ ఫోరం నాయకులు, 72 కులాల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అమలయ్యే వరకు బీసీల కోసం పోరాటం ఆగదని చెప్పారు. ఇప్పటివరకు రాజకీయంగా తలెత్తని ఎన్నో కులాలకు రాజకీయ రిజర్వేషన్ల ద్వారా న్యాయం జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే కేంద్రం రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ అంశం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర క్యాబినెట్ చేసిన తీర్మానం గవర్నర్ వద్ద ఆమోదం కోసం పడివుందని తెలిపారు. గవర్నర్ వెంటనే ఆమోదముద్ర వేసి గెజిట్ విడుదల చేయాలని కోరారు. ఆలస్యం జరిగితే, ఆర్డినెన్స్‌పై ప్రభుత్వం కోర్టులో కేవియట్ వేయకపోతే, రిజర్వేషన్ల అమలుకు ఆటంకం వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రిజర్వేషన్ల మొత్తాన్ని పెంచడం కేంద్ర పరిధిలో ఉన్నా, ఉన్న రిజర్వేషన్లలో ఉపవర్గీకరణ చేయడం రాష్ట్రానికి సంబంధించిన అధికారం అని స్పష్టం చేశారు. ఆర్డినెన్స్ను తగిన జాగ్రత్తలు లేకుండా జారీ చేస్తే, దానికి వ్యతిరేకంగా న్యాయపోరాటానికి దిగతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ఇప్పటికీ విడుదల చేయక పోవడాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రతివారం 100 గంటలు పనిచేసే ఏకైక వ్యక్తి మోడీయే

- ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాత్రమే వారానికి 100 గంటలు పనిచేసే వ్యక్తిగా తనకు తెలుసని, దేశంలోని యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ముంబై- బెంగళూరు మధ్య విమానయానంలో దాదాపు రెండు గంటల పాటు నారాయణ మూర్తితో కలిసి ప్రయాణించిన తేజస్వి సూర్య, పని గంటలు, టెక్నాలజీ, పట్టణాభివృద్ధి, తయారీ రంగం, యువత నైపుణ్యాభివృద్ధి, నాయకత్వం వంటి కీలక అంశాలపై విశేష చర్చ జరిగిందని పేర్కొన్నారు. సంభాషణలో చివర్లో "నేను వారానికి 70 గంటలు పనిచేయాలని ప్రయత్నిస్తున్నా" అని చెప్పగా, "వారానికి 100 గంటలు పనిచేసే వ్యక్తిగా నాకు తెలిసి నరేంద్ర మోదీ ఒక్కరే ఉన్నారు" అని నారాయణ మూర్తి హితవు పలికారని వెల్లడించారు.

భారత ఐటీ రంగాన్ని ప్రపంచవ్యాప్తంగా శక్తివంతమైన స్థాయికి తీసుకెళ్లిన నారాయణ మూర్తి మార్గదర్శకత్వాన్ని తేజస్వి కొనియాడారు. లక్షలాది మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం తీసుకువచ్చిన సంస్థగా ఇన్ఫోసిస్ నిలిచిందని గుర్తుచేశారు.నారాయణ మూర్తితో కలిసి తీసుకున్న సెల్ఫీని తన ఎక్స్ (హైదరాబాద్ టైమ్‌లో ట్విట్టర్) ఖాతాలో షేర్ చేసిన తేజస్వి సూర్య, ఈ భేటీ తనకు ఎంతో ప్రేరణనిచ్చిందని పేర్కొన్నారు.

## గోదావరి జలాల్లో రాజీ లేదు



- మంత్రి శ్రీధర్‌బాబు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గోదావరి జలాల విషయంలో తమ ప్రభుత్వ వైఖరి స్పష్టమని, ఒక్క నీటి బొట్టును కూడా వదులుకోవద్దనే ధృఢ సంకల్పంతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. బుధవారం పెద్దపల్లిలో జరిగిన ఇందిరాశక్తి సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి, బీఆర్ఎస్ పార్టీపై విమర్శల వర్షం కురిపించారు. "పదేళ్లు సీఎం గా నీళ్లను ఎలా మళ్లించాలా అనుకున్న కేసీఆర్‌కి, ఇప్పుడు మాత్రం ఏమీ తెలియనట్లు నటించడమెందుకని?" అంటూ ఆయన ప్రశ్నించారు. తాము గోదావరిలో తమ హక్కు సాధించేందుకు కేంద్రంతో అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. "బనకచర్ల ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోము. తెలంగాణకు పూర్తిగా వాటా లభించిన తరువాతే ఇతర ప్రాంతాల గురించి ఆలోచన" అని అన్నారు.

మిగితా 2వ పేజీలో

## రష్యాతో వ్యాపారం చేస్తే 100% అదనపు ఆంక్షలు

- నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూట్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రష్యాతో వ్యాపారం కొనసాగించే దేశాలు ఆర్థికపరమైన ఆంక్షలను ఎదుర్కోవలసి వస్తుందని భారత్, చైనా, బ్రెజిల్‌ని ఉద్దేశిస్తూ నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూట్ హెచ్చరించారు. రష్యా నుంచి చమురు, సహజ వాయువు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై అదనంగా 100 శాతం ఆంక్షలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. 'మీరు భారత ప్రధాని అయినా, చైనా అధ్యక్షుడు అయినా లేక బ్రెజిల్ అధ్యక్షుడు అయినా.. రష్యాతో వాణిజ్యం ఇంకా కొనసాగిస్తూ వారి చమురు, గ్యాస్‌ని కొనుగోలు చేస్తుంటే మీపై అదనంగా 100 శాతం ఆంక్షలు విధిస్తాను' అంటూ రూట్ ప్రకటించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి మారిన నేపథ్యంలో నాటో ప్రధాన కార్యదర్శి నుంచి ఈ హెచ్చరికలు జారీకావడం గమనార్హం. ఈ మూడు దేశాల నాయకులు శాంతి చర్చలపై దృష్టి కేంద్రీకరించాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. తాను చేస్తున్న హెచ్చరికను ఈ మూడు దేశాల నాయకులు పరిగణనలోకి తీసుకోని పక్షంలో తీవ్రంగా నష్టపోతారని కూడా ఆయన హెచ్చరించారు. శాంతి చర్చలకు కట్టుబడి ఉండాలని పుతిన్‌ని ప్రత్యక్షంగా పిలుపునివ్వాలని మూడు దేశాల నాయకులను ఆయన కోరారు. శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకోవాలని పుతిన్‌కి ఫోన్ చేసి నేరుగా చెప్పాలని ఆయన తెలిపారు. అలా చేయకపోతే భారత్, బ్రెజిల్, చైనా భారీస్థాయిలో దెబ్బ తింటాయని ఆయన చెప్పారు. కాగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై భారీ స్థాయిలో సుంకాలు విధిస్తామని ఇటీవలే ప్రకటించారు. అంతేగాక ఉక్రెయిన్‌తో 50 రోజుల్లో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోకపోతే రష్యా ఎగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తామని కూడా ట్రంప్ హెచ్చరించారు.

## పాకిస్థాన్‌లో భారీ వర్షాలు, వరదలు..

### మరో 24 మంది మృతి

బలగం టీవీ, లాహెూర్

పాకిస్థాన్‌లో భారీ వర్షాలతోపాటు వరదలు ముంచెత్తుతున్నాయి. వర్షాల సంబంధిత సంఘటనల కారణంగా గత 24 గంటల్లో పంజాబ్ ప్రావిన్స్‌లో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. 150 మంది గాయపడ్డారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మృతుల సంఖ్య ఇప్పటికి 140 కు పెరిగింది. గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా లాహెూర్, పంజాబ్ లోని కొన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయని, గురువారం వరకు ఇవి కొనసాగుతాయని అధికారులు చెప్పారు. లాహెూర్‌లో పిడుగు పడి ఇళ్ల పైకప్పులు కూలిన మూడు సంఘటనల్లో 12 మంది చనిపోయారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఉన్నారు. థోకర్ నియాజ్ బెయిగ్ ఏరియాలో ఈ సంఘటన జరిగింది. ఫైసలాబాద్‌లో ముగ్గురు, పాక్‌పట్టమ్‌లో ఒకామె, ఇద్దరు పిల్లలు చనిపోయారు. షేక్‌పుర, భక్కర్, బాహవలినగర్, షక్కోట్‌ల్లో ఒక్కొక్కరు వంతున ఒకారోలో ఇద్దరు ఇళ్లు కూలి చనిపోయారు. మంగళవారం నేషనల్ డైసాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డిఎంఎ) వర్షాల వల్ల కలిగే నష్టాలను అంచనా వేసింది. జూన్ 26 నుంచి ఈ సంఘటనల్లో 116 మంది చనిపోయారని తెలిపింది. పంజాబ్ ముఖ్యమంత్రి మర్యం నవాజ్ మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపం తెలిపారు. సహాయ కార్యక్రమాలు సరిగ్గా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# “నీళ్లు ఎలా ఇవ్వాలో కేసీఆర్‌ని అడుగు

● ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

“నీళ్లు ఇవ్వడం తెలియకపోతే కేసీఆర్‌ని అడుగు లేకుంటే కాళేశ్వరం ప్రాజెక్టును ఆయనకే అప్పగించు. మూడురోజుల్లోనే నీళ్లు రైతుల పొలాల్లోకి పారిపోతాయి” అంటూ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి గట్టి సవాల్ విసిరారు. బుధవారం సూర్యాపేటలోని మన్నెం సదాశివరెడ్డి ఫంక్షన్‌హాల్లో ‘కాళేశ్వరం %–% వాస్తవాలు’ పేరిట బీఆర్ఎస్ నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్, బీజేపీలు కలసి కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించిన జగదీశ్‌రెడ్డి, వీడియోలతో సహా ప్రాజెక్టు డిజైన్‌ను ప్రజలకు వివరించారు. మేడిగడ్డ ఒకే ప్రాజెక్టు కాదని%ొ% అనేక బరాజ్‌ల సమాహారమే కాళేశ్వరం అని స్పష్టం



చేశారు. మేడిగడ్డకు సంబంధం లేకుండానే గోదావరి జలాలు సూర్యాపేట జిల్లాకు చేరుతున్నాయన్నారు.

**“నీళ్లు రాలేదంటారా? మా తండాకు రాకండి”**

“సీఎం రేవంత్, మంత్రులు సూర్యాపేటకు కాళేశ్వరం నీళ్లు రాలేదంటున్నారు. దమ్ముంటే చివరి ఆయకట్టు గ్రామం చినసీతారం తండాకు రండి. అక్కడే నీళ్లు వచ్చాయా లేదా అనేది తెలుతుంది. రాలేదంటే చెప్పుదెబ్బలకైనా సిద్ధం, లేదంటే నేనే ఉరి వేసుకుంటా” అని సీఎం, మంత్రులను ఉద్దేశించి సవాల్ విసిరారు. ప్రస్తుతం నందిమేడారం వద్ద రోజుకు లక్ష క్యూసెక్కుల గోదావరి జలాలు వృథాగా పోతున్నాయని, అక్కడ పంపులు ఆన్ చేస్తే చివరి ఆయకట్టు వరకు నీళ్లు చేరతాయని వివరించారు. కాళేశ్వరం కూలలేదని, కొట్టుకుపోలేదని స్పష్టం చేశారు.

“కాళేశ్వరం జలాల కోసం ఉద్యమం ఇక సూర్యాపేట నుంచే ప్రారంభించాలి. లక్ష మంది రైతులతో కలిసి ప్రాజెక్టుల వద్దకు పో %ఝితీ–ఎష్ఘు% పెట్టేందుకు సిద్ధంగా ఉండాలి” అంటూ రైతులను ఉద్యమానికి పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ చేతులు కలిపి ఒకవైపు చంద్రబాబుకు నీళ్లు అప్పగించేందుకు, మరోవైపు ఇసుక దోపిడీకి తెరలేపేందుకు కుట్ర చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

# బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి..

● జిల్లా సీనియర్ నాయకులు కొత్తపల్లి మాజీ ఎంపీపీ వాసాల రమేష్

**బలగం టీవీ, గంగాధర**




కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురనగర్ చౌరస్తాలో గంగాధర మండల స్థానిక సంస్థల ఎన్నికల కార్యాశాల కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు మాజీ ఎంపీపీ కొత్తపల్లి వాసాల రమేష్ ముఖ్యఅతిథిగా హాజరు కావడం జరిగింది.గంగాధరలో స్థానిక సంస్థల ఎన్నికలలో అధిక మొత్తంలో ఎంపీటీసీ స్థానాలు కైవసం చేసుకుని, మండల ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని మరియు గంగాధర జెడ్పిటిసిని బిజెపి కైవసం చేసుకోవాలని ఈ కార్యక్రమ ముఖ్య అతిథి జిల్లా సీనియర్ నాయకులు కొత్తపల్లి మాజీ ఎంపీపీ వాసాల రమేష్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా వాసాల రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలలో విఫలం పైన కాంగ్రెస్ పార్టీ 420 హామీల పైన ఇంటింటికి ప్రచారం చేయాలని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగింది. 11 సంవత్సరాల కాలంలో నరేంద్ర మోడీ గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన సౌకర్యాల కోసం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం నిధులు మరియు అభివృద్ధి కార్యక్రమాల పైన ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించి, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరవేయడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని,ఎంపీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో గంగాధర మండలంలో మూడు కోట్ల 60 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణం, ఐమాక్స్ లైట్లు, సంఘ భవనాలు, కమ్యూనిటీ భవనాలు మరియు ఇతర కార్యక్రమాల అభివృద్ధి చేసిన వివరాలను ప్రతి ఒక్క గ్రామంలో ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేసి, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునివ్వడం జరిగింది. వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికల్లో 52 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని, మాయమాటలతో కాలం గడుపుతూ స్థానిక సంస్థలు ఎన్నికలను నిర్వహించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు భయపడి ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించలేదని, ఈ సందర్భంగా అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం కోసం సిద్ధంగా ఉన్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైద రామానుజం జిల్లా కోశాధికారి, పెరుక శ్రవణ్ కుమార్ అసెంబ్లీ కన్వీనర్,మాజీ మండల అధ్యక్షులు కోల అశోక్,దూలం కళ్యాణ్ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు, సదాల భాస్కర్ డిస్టిక్ కౌన్సిలర్ మెంబర్, దళిత మోర్చా అధికారులు మల్యాల వినయ్ సాగర్, మాజీ సర్పంచ్ రేండ్ల రాజిరెడ్డి,

మండల ప్రధాన కార్యదర్శి రెండ్ల శ్రీనివాస్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు తాళ్ల రాజశేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షులు దయ్యాల ప్రణయ్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోదావరి జలాల్లో రాజీ లేదు

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ విషయంలో కేంద్రమే తుది నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం గురించి మాట్లాడుతూ, అదే ప్రాంతంలోని రైతులకు నీరు అందకుండా నిర్మించడం దారుణమని విమర్శించారు.

కాళేశ్వరం డ్యామ్‌లలో అవకతవకలపై నేడు బీఆర్ఎస్ నేతలు గొప్పగా మాట్లాడడం వెనక రాజకీయ ప్రయోజనాలే ఉన్నాయని ఎద్దేవా చేశారు. “బనకచర్లపై ఇంత ఆరాటం గతంలో ఎందుకు చూపలేదో చెప్పాలని” డిమాండ్ చేశారు. పెద్దపల్లిలోని సభలో మహిళా సంక్షేమంపై మాట్లాడుతూ, “విద్యార్థుల యూనిఫాంలు కుట్టే పనులు మహిళా సంఘాలకు అప్పగించాం. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో కూడా మహిళలకు ప్రాధాన్యం ఇచ్చాం. ఆర్టీసీలో 9 బస్సులను మహిళా సంఘాల నుండి అద్దెకు తీసుకున్నాం” అని వివరించారు. గతంలో ఇవన్నీ కొందరు పెద్దమనుషులకే కేటాయించబడేవని గుర్తు చేశారు.“కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం. ఈ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది” అని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని, ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

## గోపాల్ నగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద చెట్ల సమస్య



**బలగం టీవీ, సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పి.ఎస్. గోపాల్ నగర్ పాఠశాల సమీపంలో ఉన్న కొన్ని చెట్ల వల్ల విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ చెట్ల నుండి దూది లాంటి కణాలు గాలిలో కలిసిపోయి కళ్ళలో పడుతున్నాయని, దీనివల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై జంగంపెల్లి మల్లేశం మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు ఈ దూలి కణాల వల్ల కంటి సమస్యలు, ఇతర ఆరోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇదే విధంగా, ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు కూడా దూలి వల్ల దృష్టి లోపం ఏర్పడి, ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇది ప్రజారోగ్యానికి ముప్పుగా మారే ప్రమాదం ఉందని అన్నారు.

# జైపూర్‌లో ‘టాక్ జర్నలిజం 2025’కి కేటీఆర్ ముఖ్య వక్తగా ఆహ్వానం..

**బలగం టీవి, హైదరాబాద్**



భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జూలై 19–20, 2025 తేదీల్లో జైపూర్‌లో జరిగే ‘టాక్ జర్నలిజం 2025’ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఆహ్వానితులయ్యారు. ఇది దేశంలోని ప్రముఖ జర్నలిస్టులు, మేధావులు, రాజకీయ నాయకులు పాల్గొనే అత్యంత ప్రతిష్టాత్మక సమావేశాలలో ఒకటి. దక్షిణ భారత రాజకీయాల్లో ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని బలంగా వినిపిస్తున్న, విజన్ ఉన్న వినూత్న నాయకుడిగా పేరు తెచ్చుకున్న కేటీఆర్‌ను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కెటిఆర్ ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రిగా తెలంగాణలో చేసిన పాలనా మార్పులు, సాధించిన విజయాల నేపథ్యంలో కెటిఆర్ ను ముఖ్యవక్తగా ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణను టెక్నాలజీ మరియు పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడంలో కేటీఆర్ పాత్ర కీలకమైందని, అంతేకాక దేశ రాజకీయాలపై స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్తపరచగల నాయకుడిగా ఆయనను నిర్వాహకులు పేర్కొన్నారు.

టాక్ జర్నలిజం అనేది దేశ విదేశాల జర్నలిస్టులు మీడియా రంగంలోని మార్పులు, ధోరణులు మరియు సవాళ్లపై చర్చించేందుకు కలుసుకునే ఒక ప్రముఖ వేదిక. ఇప్పటివరకు జరిగిన ఎనిమిది ఎడిషన్లలో రాజదీప్ సర్దేశాయి, రవీశ్ కుమార్, బర్కా దత్, సౌరభ్ ద్వివేది, సుహాసిని హైదర్ లాంటి ప్రముఖ భారతీయ జర్నలిస్టులు పాల్గొన్నారు. అంతర్జాతీయంగా ఎడ్వర్డ్ స్నోడెన్, పులిట్జర్ బోర్డు మాజీ అధ్యక్షుడు యూజిన్ రాబిన్సన్, ఐసీఐజే ఎడిటర్ గెరార్డ్ రైల్, గార్డియన్‌కు చెందిన నిక్ డేవిస్, సండే టైమ్స్‌కు చెందిన క్రిస్టినా ల్యాంబ్ వంటి ప్రముఖులు ఈ వేదికపై పాల్గొన్నారు. గతంలో సచిన్ పైలట్, అసదుద్దీన్ ఒవైసీ, సుబ్రమణ్య స్వామి, జీవీఎల్ నరసింహారావు, రాఘవ్ చద్దా, డి. రాజా, ప్రియాంకా చతుర్వేది తదితరులు పాల్గొన్నారు. ఈసారి కేటీఆర్ తన ప్రసంగంలో ప్రాంతీయ అసమానతలు, సమాఖ్య విధానం, మారుతున్న భారత రాజకీయాల దిశ వంటి అంశాలను ప్రస్తావించనున్నారు.

# నది జాలాలపై కమిటీ

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రజలకు జవాబు ఇవ్వడానికి ఉన్నాం. సమస్యలను ఎలా పరిష్కరించాలన్న అవగాహన మాకుంది. వివాదాలకు పరిష్కారం చూపించడమే మా బాధ్యత..” అని ముఖ్యమంత్రి వివరించారు.

ఈ సమావేశంలో బనకచర్ల అంశంపై చర్చ జరగలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి జలాల విషయంలో నెలకొన్న సమస్యలపై చర్చించేం దుకు అధికారులు, ఇంజినీర్లతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్ నుంచి గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తామనే ప్రతిపాదన ఈ సమావేశంలో రాలేదని ఆయన తేల్చి చెప్పారు. అలాంటి ప్రతిపాదనే రానప్పుడు దానిని ఆపాలనే చర్చ కూడా ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. ఇది అపెక్స్ కమిటీ సమావేశం కాదని కూడా ఆయన స్పష్టం చేశారు.

## నిపుణుల కమిటీ రిపోర్టు మేరకే తదుపరి చర్యలు

**(మొదటి పేజీ తరువాయి)**

కొందరు ఎదురు చూస్తున్నారనీ, అయితే వివాదాలు లేకుండా సమస్యలు పరిష్కరించుకోవడమే తమ ఎజెండా అని తేల్చిచెప్పారు. తెలంగాణ హక్కులను మాజీ సీఎం కేసీఆర్ గతంలో ఏపీకి ధారాదత్తం చేశారని విమర్శించారు. ఆయన చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అన్ని రిజర్వాయర్లు, కెనాల్స్ వద్ద యుద్ధప్రాతిపదిక టెలీమెట్రీలు ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. కృష్ణా నదీజలాల వాడకం లెక్కలపై అనుమానాలు ఉన్నాయనీ, అందుకే టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా రాష్ట్రమే నిధులు కేటాయిస్తుందన్నారు. వీటి ఏర్పాటుపై గత ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించిందని చెప్పారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై కాంగ్రెస్ నీతులు విడ్డూరం

● మాట్ల మధు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీపై కాంగ్రెస్ పార్టీ నైతికత మాట్లాడటం అపస్వరంగా మారిందని బీఆర్ఎస్ నేత మాట్ల మధు మండిపడ్డారు. మంగళవారం జిల్లెళ్ల గ్రామానికి చెందిన డబుల్ బెడ్‌రూమ్ అర్హులతో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, గత బీఆర్ఎస్ హయాంలో పేదల కోసం నిర్మించిన ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పనకు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు కనీస మౌలిక వసతులు కల్పించలేకపోతే తమ నాయకుడు కేటీఆర్ ద్వారా అవసరమైన పనులు పూర్తిచేయిస్తామని ప్రకటించారు. కొన్ని మందికి మాత్రమే ఇళ్లు కేటాయించి మిగిలిన అర్హులను నిర్లక్ష్యం చేయడం అన్యాయం అని విమర్శించారు. మిగిలిన భూమిలో ‘ఇందిరమ్మ ఇల్లు’ల నిర్మాణం చేపట్టి, గుంట చొప్పున స్థలాలు కేటాయించాలని సూచించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరుపై గ్రామసభలు నిర్వహించగా, కాంగ్రెస్ నాయకులే అడ్డుపడ్డారని, హైదరాబాద్‌కి వెళ్లి ధర్నాలు చేసినవారే నేడు నీతులు చెబుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కొందరే అప్పట్లో ఇళ్ల నిర్మాణానికి ఆటంకం కలిగించారని ఆరోపించారు. కేటీఆర్‌ను బద్నాం చేయాలన్న కుట్రలతో కాంగ్రెస్ అడ్డుదిడ్డంగా వ్యవహరించినా తమ ప్రభుత్వం అభివృద్ధి పథం నుంచి మడిగలేదన్నారు. “ఇళ్ల కోసం తాము అడ్డు పడలేదని, సహకరించామే తప్ప అవరోధంగా నిలవలేదని” స్పష్టం చేశారు. ఎవరో రాసిన స్క్రిప్ట్‌తో మాట్లాడే వారు తామికాదు” కాంగ్రెస్ రాజకీయాల్లో గులాముల్లా వుందనే ప్రచారాన్ని ఖండించారు.

ఇప్పటికే నిర్మించిన ఇళ్లకు పెయింట్ వేయించడం, విద్యుత్, నీటి వంటి మౌలిక సదుపాయాలను కల్పించడమే కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనమవుతుందని అన్నారు. మరోసారి తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమని స్పష్టం చేశారు.

# రాజన్న ఆలయం, పట్టణ అభివృద్ధికి కట్టుబడున్నాం..



- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

**బలగం టీవీ, వేములవాడ**

ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వేములవాడ రాజన్న ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణాన్ని, రాజన్న ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నవంబర్‌లో రూ. 1000 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయానికి రూ. 150 కోట్లు కేటాయించిందని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వం కేవలం రంగుల బ్రోచర్లలోనే అభివృద్ధిని చూపించిందని, తాము మాత్రం క్షేత్రస్థాయిలో పనులు చేస్తున్నామని స్పష్టం చేశారు. మూడవ బ్రిడ్జి నిర్మాణం లేకపోయినా, గత ప్రభుత్వం తమ వీడియోలలో బ్రిడ్జి ఉన్నట్లు చూపించి ప్రజలను మోసం చేసిందని ఆయన ఆరోపించారు.

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు.. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రూ. 35 కోట్లతో అన్నదాన సత్రాన్ని నిర్మిస్తున్నామని, ఆలయానికి వెళ్లే రహదారులను రూ. 47 కోట్లతో రోడ్డు వెడల్పు విస్తరించి ట్రాఫిక్ సమస్యలను తగ్గించనున్నారని, రూ. 6 కోట్లతో మూడవ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించామని, ఆలయ ప్రాంగణంలో రూ. 76 కోట్లతో విస్తృత అభివృద్ధి పనులు చేపట్టనున్నారని, రూ. 9 కోట్లతో మూల వాగు, గుడి చెరువుల్లో మురికి నీరు కలవకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వేములవాడలో 50 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక గోశాలను నిర్మించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ఇచ్చిన మాటకు కట్టుబడి రాజన్న ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆది శ్రీనివాస్ పునరుద్ఘాటించారు. శృంగేరి పీఠం సూచనలతో భీమేశ్వర ఆలయంలో త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. రాజన్న సన్నిధికి వచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.



# బీఆర్ఎస్‌కు భారీ షాక్..

- పార్టీ వీడిన ఇల్లంతకుంట మండల మాజీ సర్పంచులు
- కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించిన కవ్వంపల్లి

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు, ముఖ్య నాయకులు బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెబుతూ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు . బుధవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నూతనంగా చేరిన నేతలకు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ "కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, ప్రగతిశీల పాలన ప్రజల్ని ఆకట్టుకుంటున్నాయన్నారు. పార్టీ బలోపేతానికి ఎవరు కష్టపడి పనిచేస్తారో వారికి తగిన గౌరవం లభిస్తుందన్నారు. పార్టీ అంతర్గత వ్యవహారాలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, బహిరంగ వేదికలపై మాట్లాడవద్దు" అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కలిసి మెలిసి కృషి చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో తిప్పాపూర్ గ్రామ మాజీ సర్పంచులు దమ్మని లక్ష్మి–లక్ష్మణ్, బొల్లవేణి మంజుల–రమేశ్, గాలిపెల్లి మాజీ సర్పంచులు అరుకుటి విజయలక్ష్మి–మల్లేశం, న్యాత పోచయ్య, జవారిపేట మాజీ సర్పంచ్ పల్లె శ్రీలత–రాజశేఖర్, ఉప సర్పంచ్ కొడుముంజ తిరుపతి, గాలిపల్లి ఉపసర్పంచ్ కాలువ దామోదర్, ఆ పార్టీ నాయకులు అయ్యన్నగారి భగవాన్ రెడ్డి, నర్సింహారెడ్డి,దండి మల్లేశం, దశనం ఆంజనేయులు, జవారిపేట నుంచి పల్లె ప్రణయ్ కుమార్, బెజ్జంకి రమేశ్, జేరిపోతుల పౌలు, బెజ్జంకి తిరుపతి, సిరవేణి మహేశ్, బి.యాది మల్లయ్య, ఏగుర్ల నర్సయ్య, ఏగుర్ల బాలయ్య, దమ్మని రాజు, దమ్మని అభినవ్, జేరిపోతుల కిషన్, అబ్బసాని మల్లయ్య, కొడిముంజ సత్తయ్య, సాంబ మంజుల, బొల్లవేణి నర్సయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పీసీసీ కోఆర్డినేటర్ పాశం రాజేందర్ రెడ్డి, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె అయిలయ్య యాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జ్యోతి, పార్టీ నాయకులు ఎలగందుల ప్రసాద్, పసుల వెంకటి, చిట్టి ఆనంద్ రెడ్డి, ఆకుల సత్యం, యాదవ రెడ్డి, తీగల పుష్పలత, కె.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీ విద్యార్థినుల కన్నీరు

- అధ్వానంగా భోజనం, వెట్టిచాకిరిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు..

**బలగం టీవీ, కరీంనగర్**

కేశవపట్నంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు తమకు ఎదురవుతున్న సమస్యలపై మానకొండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముందు కన్నీరు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మంగళవారం పాఠశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థినులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు పెట్టే భోజనం అత్యంత నాసిరకంగా ఉందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. కూరలు రెండోసారి వడ్డించకపోవడంతో కేవలం ఉట్టి అన్నం మాత్రమే తినాల్సి వస్తోందని కన్నీటిపర్యంతమయ్యారు. అంతేకాకుండా, తమతో చపాతీలు, పూరీలు చేయిస్తున్నారని, వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. తమకు పడుతున్న ఇబ్బందులను ఆయన ముందు వివరించారు. విద్యార్థినుల కష్టాలు విన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సబ్ సెంటర్‌లను ఆకస్మిక తనిఖీ

**బలగం టీవీ, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోరెం, తడగొండ గ్రామాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సబ్ సెంటర్ లను బుధవారం రోజున జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత సబ్ సెంటర్లోని అన్ని రికార్డులను పరిశీలించి, ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, ఇమినైజేషన్ డ్యూ లిస్టు రిజిస్టర్, యు విన్ యాప్ లో వ్యాక్సినేషన్ చేసిన పిల్లల వివరాలు అప్డేట్ చేయాలని, వ్యాక్సిన్ వేసిన తర్వాత అరగంటసేపు పిల్లలను అబ్జర్వ్ చేయాలని, అలాగే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, స్కూల్, హాస్టల్స్ ను తరచూ విజిట్ చేయాలని, పిల్లలకు ఆరోగ్య సూచనలు ఇవ్వాలని, అసంక్రమిత వ్యాధులు బిపి,షుగర్, క్యాన్సర్ సంబంధించి న్యూ రిజిస్ట్రేషన్స్, ఫాలో అప్ రోజువారీగా చేయాలని, నేషనల్ ప్రోగ్రామ్స్ కి సంబంధించిన టీబీ, లెప్రసీ, తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించి, మందులు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సంపత్, జిల్లా టీబీ , లేప్రాసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత, జిల్లా ఎన్సీడీ అధికారి డాక్టర్ రామకృష్ణ, సబ్ సెంటర్ ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం..

**బలగం టీవీ, కరీంనగర్**



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న బిల్లుల కారణంగా అప్పుల బాధ తాళలేక మాజీ సర్పంచ్ తాళ్ల విజయలక్ష్మి భర్త రవి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ తాళ్ల విజయలక్ష్మి గ్రామ అభివృద్ధి పనుల కోసం తన సొంత భూమిని, బంగారాన్ని తాకట్టు పెట్టి దాదాపు రూ. 11 లక్షలు వెచ్చించారు. ఈ బిల్లుల మంజూరు కోసం ఆమె ప్రభుత్వానికి పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అధికారులు పట్టించుకోలేదని ఆరోపణలు వస్తున్నాయి. బిల్లులు రాకపోవడంతో, అప్పులు ఇచ్చిన వారి నుండి ఒత్తిడి పెరిగింది. పెరిగిన వడ్డీలు, రుణదాతల వేధింపులతో మనస్తాపానికి గురైన విజయలక్ష్మి కుటుంబం తీవ్ర ఆవేదనలో ఉంది. ఈ పరిస్థితిని తట్టుకోలేక విజయలక్ష్మి భర్త రవి గడ్డి మందు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే ఆయనను కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రవి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

# నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని,విద్యార్థులకు ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానం చేశారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి మెమెంటో, నోట్ బుక్,పెన్,ద్వితీయ,తృతీయ బహుమతి గెలుపొందిన వారికి కూడా మెమెంటో,నోట్ బుక్,పెన్ అందజేశారు. పాల్గొన్న ప్రతి విద్యార్థిని విద్యార్థికి నోట్ బుక్, పెన్ను అందజేశారు. ఈ సందర్భంగా ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ: విద్యార్థిని, విద్యార్థులకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ యొక్క ప్రాముఖ్యతను, భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో దేశం కోసం ఏ విధంగా పని చేశారని తెలియజేయడం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థిని, విద్యార్థులు నేతాజీ, అంబేద్కర్, స్వామి వివేకానంద, లాంటి మహనీయులను స్ఫూర్తిగా



తీసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో గాను కృషి చేశారని, స్వాతంత్రం తీసుకురావడం లో ఆయన పాత్ర దేశ ప్రజలు మరువలేరని అని అన్నారు.రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టిన మహెూన్నత పోరాట ధీరుడు నేతాజీ అని తెలిపారు.



# బాధితుడికి పరామర్శ..

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

బతుకు దెరువు కోసం వలస బాట పట్టి మండేపల్లి గ్రామానికి చెందిన మంద మహేష్ సౌదీ అరేబియాలో ఇటీవలమూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయపడి కేటీఆర్ చొరవతో స్వదేశానికి వచ్చి హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రి లో చికిత్స పొందారు. కేటీఆర్ 10 లక్షల రూపాయలతో చికిత్య చేయించారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం కోలుకున్న బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త మంద మహేష్ ని కేటీఆర్ సేన తంగళ్లపల్లి మండల అధ్యక్షులు నందగిరి భాస్కర్ గౌడ్ మండేపెల్లి లోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించి కుటుంబానికి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండేపల్లి కేటీఆర్ సేన గ్రామ శాఖ అధ్యక్షులు బండి ప్రశాంత్, మాజీ సర్పంచ్ తంగళ్లపల్లి దేవయ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుదాస్, ప్రశాంత్, రాజు, ప్రదీప్,విష్ణు, రంజిత్, కృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇంగ్లండ్‌కు రెండు పాయింట్లు కోత



**బలగం టీవీ, హైదరాబాద్**

లార్డ్స్ వేదికగా భారత్‌ను 22 పరుగుల తేడాతో ఓడించిన ఇంగ్లండ్ జట్టు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో మాత్రం వెనకడుగు వేసింది. మ్యాచ్ సమయంలో స్లో ఓవర్‌రేట్ కారణంగా మ్యాచ్ ఫీజు శిక్షతో పాటు రెండు పాయింట్లు కోల్పోవాల్సి వచ్చింది. ఈ పరిణామంతో ఇంగ్లండ్ జట్టు మూడో స్థానానికి జారిపోయింది.ఈ విషయాన్ని ఐసీసీ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. లార్డ్స్ టెస్ట్ సందర్భంగా ఇంగ్లండ్ జట్టు రెండు ఓవర్లు వెనుకబడిందని, దీనిపై మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ చర్యలు తీసుకున్నారని తెలిపింది. ఫలితంగా కెప్టెన్ బెన్ స్టోక్స్‌తో పాటు మొత్తం జట్టుపై మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించినట్టు పేర్కొంది.

**ఐసీసీ నిబంధనల ప్రకారం...**

ప్రతి ఓవర్ ఆలస్యం పై 5% మ్యాచ్ ఫీజును జరిమానాగా విధించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఐసీసీ నిబంధనల ప్రకారం ఒక్కో ఓవర్ ఆలస్యం వల్ల ఒక్కో పాయింట్ కోత పడుతుంది. ఈ మేరకు ఇంగ్లండ్ రెండు ఓవర్లు ఆలస్యం చేయడంతో రెండు పాయింట్లు కోల్పోయింది. ఇంగ్లండ్ 24 పాయింట్ల నుంచి 22కి పడిపోవడంతో, వారి పాయింట్ శాతం 66.67% నుంచి 61.11%కి తగ్గింది. దీనివల్ల శ్రీలంక జట్టు 66.67%తో రెండో స్థానానికి చేరింది. ఇంగ్లండ్ మూడో స్థానానికి వెనకడుగు వేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా మూడు మ్యాచ్‌లను గెలిచి 100% పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. భారత్ 33.33% పాయింట్లతో నాల్గో స్థానంలో కొనసాగుతోంది.

# రాష్ట్రపతి భవన్‌లో 'కన్నప్ప' ప్రదర్శన

**బలగం టీవీ, హైదరాబాద్**




మంచు విష్ణు నటించిన చిత్రం 'కన్నప్ప' ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సినిమాను వీక్షించిన సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అధికారులు విష్ణు నటనను ప్రశంసించారు. ఈ ప్రత్యేక ప్రదర్శన పట్ల చిత్ర బృందం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో ఒక ప్రకటన విడుదల చేసింది. భక్తి కథాంశం, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన ఈ చిత్రానికి లభించిన గుర్తింపు తమకు గర్వకారణమని వారు పేర్కొన్నారు. శివ భక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రం జూన్ 27న విడుదలైంది. ముకేశ్ కుమార్ సింగ్ దీనికి దర్శకత్వం వహించారు. విష్ణు నటన, ఎమోషన్స్, క్లైమాక్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో రుద్రగా ప్రభాస్, శివపార్వతులుగా అక్షయ్ కుమార్ – కాజల్, కిరాతుడిగా మోహన్ లాల్ తమ నటనతో అలరించారు.

# 'వార్ 2' కౌంట్ డౌన్ పోస్టర్

**బలగం టీవీ, హైదరాబాద్**




బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న భారీ స్పై థ్రిల్లర్ 'వార్ 2'. ఈ మూవీ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2019లో హృతిక్ నటించిన బ్లాక్‌బస్టర్ స్పై థ్రిల్లర్ 'వార్'కి ఇది సీక్వెల్‌గా వస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో హృతిక్ మరోసారి రా ఏజెంట్ మేజర్ కబీర్ ధాలివాల్ పాత్రలో కనిపించనున్నారు. తారక్ ఈ ఫ్రాంచైజీలో ప్రతినాయకుడి పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఆగష్టు 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్ మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఈ సినిమా విడుదలకు ఇంకా 30 రోజులే ఉందని తెలుపుతూ.. చిత్రం బృందం కౌంట్‌డౌన్ పోస్టర్‌ను విడుదల చేసింది. తాజాగా ఈ పోస్టర్‌ను 'ఎక్స్' వేదికగా తారక్ షేర్ చేశారు. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా.. యశ్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

## 'ఇది పాట కాదు.. జీవితం' వీడియో సాంగ్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన కుబేర చిత్రం నుంచి ఎమోషనల్ వీడియో సాంగ్ వచ్చేసింది. ఇప్పటికే వరుసగా ఈ చిత్రం నుంచి వీడియో సాంగ్స్‌ను మేకర్స్ విడుదల చేస్తున్నారు. దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. అయితే, ఇందులోని " బడిలో చెప్పని పాఠం ఇదిరా.. బతికే నేర్చుకో నా కొడుకా " అనే ఎమోషనల్ పాట వీడియో వచ్చేసింది. నంద కిశోర్ సాహిత్యం అందించిన ఈ గీతాన్ని సింధూరి విశాల్ ఆలపించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చారు. జూన్ 20న విడుదలైన ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ వేదికైన అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. 'నా కొడుకా' పాట టాప్ ట్రెండింగ్‌లో వైరల్ అవుతోంది. ఇది పాట కాదు.. జీవితం అంటూ ఈ పాట వింటుంటే మా అమ్మ గుర్తొస్తుంది.. ఈ పాట రాసిన నంద కిషోర్‌కి పాదాభివందనం అంటూ సోషల్ మీడియాలో స్పందనలు వెల్లువెత్తుతున్నాయి.

# టెస్ట్ ర్యాంకింగ్స్‌లో జో రూట్ నెంబర్ వన్

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐసీసీ టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ స్టార్ బ్యాట్స్‌మెన్ జో రూట్ మళ్లీ అగ్రస్థానాన్ని అందుకున్నాడు. లార్డ్స్ వేదికగా భారత్‌తో జరిగిన మూడో టెస్ట్‌లో రూట్ 104, 40 పరుగులు చేసిన ఫలితంగా ఇది అతని ఎనిమిదోసారి నెంబర్ వన్ స్థానంలోకి రావడం. ప్రస్తుతం అతడి ఖాతాలో 888 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. 34 ఏళ్ల వయస్సులో టెస్ట్ ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్‌గా నిలిచిన అతడు, 2014లో 37 ఏళ్ల కుమార సంగక్కర తర్వాత ఈ ఘనత సాధించిన వయోవృద్ధ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు.

ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ హ్యారీ బ్రూక్ మాత్రం రెండో స్థానాన్ని కోల్పోయి, న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌కు వెనుకంజలో మూడో స్థానానికి పరిమితమయ్యాడు.ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ నాలుగో స్థానం దక్కించుకోగా, టీమిండియా యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ ఒక స్థానం కోల్పోయి ఐదో స్థానానికి చేరాడు. భారత్ వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ ఎనిమిదో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొమ్మిదో స్థానాల్లో ఉన్నారు. వీరిలో పంత్ ఒక స్థానం, గిల్ మూడు స్థానాలు దిగజారారు. ఇంగ్లండ్‌కి చెందిన జేమీ స్మిత్ టాప్ 10లోకి ప్రవేశించి పదో స్థానంలో నిలిచాడు.

ఇక లార్డ్స్‌లో 72, 61 నాటౌట్ పరుగులు చేసిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఐదు స్థానాలు ఎగబాకి 34వ స్థానానికి చేరాడు. అదే మ్యాచ్‌లో 100, 39 పరుగులతో ఆకట్టుకున్న కేఎల్ రాహుల్ కూడా ఐదు స్థానాలు మెరుగుపడుతూ జడేజా వెంట 35వ స్థానంలో నిలిచాడు.

ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ లార్డ్స్ టెస్ట్‌లో 77 పరుగులు, 5 వికెట్లు తీయడంతో రెండు స్థానాలు ఎగబాకి బ్యాటింగ్‌లో 42వ స్థానానికి, బౌలింగ్‌లో ఒక స్థానం ఎగబాకి 45వ స్థానానికి చేరాడు.


**బుమ్రా దూకుడు**

బౌలింగ్ విభాగంలో టీమిండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తన ఆధిక్యతను కొనసాగిస్తూ 901 పాయింట్లతో నెంబర్ వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడా రెండో స్థానంలో ఉన్నాడు.

ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోలాండ్ ఏకంగా ఆరు స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ అయిన ఆరో స్థానం సాధించాడు. ఇప్పటివరకు 62 టెస్ట్ వికెట్లు తీసిన బోలాండ్, సగటుగా 16.53 రన్‌లకే వికెట్లు పడగొట్టాడు. ఈ దశలో అతడికంటే మెరుగైన గణాంకాలు కేవలం ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమర్లు జార్జ్ లోహ్మాన్, సిడ్నీ బార్న్స్‌కి మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే టాప్–10 బౌలర్లలో పాట్ కమ్మిన్స్, జోష్ హాజిల్‌వుడ్, నాథన్ లియాన్, మిచెల్ స్టార్క్‌లతో పాటు ఐదవ ఆటగాడిగా బోలాండ్ చేరడం విశేషం. ఇలాంటి ఆధిపత్యం చివరిసారిగా 1958లో ఇంగ్లండ్ జట్టులో 6 మంది బౌలర్లు టాప్ 12లో ఉండగా కనిపించింది.

ఇక భారత ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ 58వ స్థానం నుంచి 46వ స్థానానికి ఎగబాకి మంచి ప్రగతిని నమోదు చేశాడు.

# రవితేజకు పితృ వియోగం



**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి భూపతిరాజు రాజగోపాల్ రాజు (90) మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా బాధపడుతున్న రాజగోపాల్, కుటుంబ సభ్యుల మధ్యే మృతిచెందారు. బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రాజగోపాల్ రాజు వృత్తిరీత్యా ఫార్మసిస్ట్. ఉద్యోగం నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సేవలందించారు. ఈ కారణంగా రవితేజ బాల్యంలోనే అనేక ప్రాంతాల్లో నివాసం ఉండాల్సి వచ్చింది. దీని వలననే రవితేజకు పలు యాసలు బాగా వచ్చాయని అతడి సన్నిహితులు చెబుతారు. రాజగోపాల్‌కు ముగ్గురు కుమారులు –రవితేజ, రఘు, భరత్ రాజు. రాజగోపాల్ స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గంపేట.

మెగాస్టార్ చిరంజీవి సైతం తన సానుభూతి వ్యక్తం చేశారు. "సోదరుడు రవితేజ తండ్రి మరణవార్త విని చాలా బాధపడుతున్నాను. ఆయనను చివరిసారిగా వాల్తేర్ వీరయ్య సెట్లో కలిశాను. కుటుంబానికి నా హృదయపూర్వక సానుభూతి. భూపతిరాజు గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను" అంటూ చిరు తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. సినీ ప్రముఖులు, అభిమానులు, సన్నిహితులు రవితేజ కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నారు.

# భారత మహిళల జట్టు విజయం

- **4 వికెట్ల తేడాతో విజయం**
- **మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి**



**బలగం టీవీ, హైదరాబాద్**

భారత మహిళల జట్టు వన్డే సిరీస్‌లోనూ దూకుడుగా ఆరంభించింది. మంగళవారం సౌథాంప్టన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో ఇంగ్లాండ్‌పై 4 వికెట్ల తేడాతో విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌లో 1–0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

టాస్ గెలిచిన ఇంగ్లాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుని 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 258 పరుగులు చేసింది. ఓపెనర్ సోఫియా డంక్లీ (83బీ 92 బంతుల్లో 9 ఫోర్లు), డేవిడ్‌సన్ రిచర్డ్స్ (53) అర్ధశతకాలు నమోదు చేశారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్ చెరో రెండు వికెట్లు, అమన్‌జోత్ కౌర్, శ్రీ చరణి చెరో వికెట్ తీసుకున్నారు.

259 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు, 48.2 ఓవర్లలో 6 వికెట్లు మాత్రమే కోల్పోయి గెలుపొందింది. దీప్తి శర్మ (62 నాటౌట్‌బీ 64 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) అద్భుతంగా ఆడి జట్టును గెలుపు గూటికి చేర్చింది. జెమీమా రోడ్రిగ్స్ (48), ప్రతీకా రావల్ (36), స్మృతి మంధాన (28), హర్లీన్ డియోల్ (27), హర్మన్‌ప్రీత్ కౌర్ (17), రీచా ఘోష్ (10) ఉపయోగకర పరుగులు చేశారు. చివర్లో అమన్‌జోత్ కౌర్ (20 నాటౌట్‌బీ 14 బంతుల్లో 3 ఫోర్లు) కూడా చక్కటి సహకారం అందించింది. ఇంగ్లాండ్ బౌలర్లలో ఛార్లెట్ డీన్ 2 వికెట్లు తీయగా, లారెన్ బెల్, సోఫీ ఎకెల్‌స్టోన్, లారెన్ ఫైలర్ చెరో వికెట్ తీసుకున్నారు.